RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 307 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శుక్రవారం, 10 మే 2024 పేజీలు : 4 వెల : 2/-

# మోదీ హయాంలో బిలియనీర్లే బాగుపడ్డారు

## పేదలకు అండగా నిలిచేది కాంగ్రెస్ మాత్రమే

## మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.లక్ష డిపాజిట్ చేస్తాం: రాహుల్ గాంధీ



నర్సాపూర్: ఈ దేశంలో రాజ్యాంగంతోనే పేదలకు బలమైన శక్తి వచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో ఆయన ప్రసంగించారు. “గొప్ప మేధావులు ఏళ్ల తరబడి కృషి చేసి దేశానికి రాజ్యాంగం అందించారు. ఎంతో గొప్పదైన మన రాజ్యాంగాన్ని మారుస్తామని భాజపా నేతలు చెబుతున్నారు. దేశంలో 90శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం దక్కటం లేదు. విద్య, ఉద్యోగాలు, ఓటు హక్కు అన్నీ మనకు రాజ్యాంగం ద్వారానే వచ్చాయి. దాంతో పాటు రిజర్వేషన్లు కూడా రద్దు చేయాలని భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర చేస్తున్నాయి. రిజర్వేషన్లు రద్దు చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తున్నారు. క్రమంగా అన్నింటినీ ప్రైవేటు పరం చేసి రిజర్వేషన్లు రద్దు చేయాలనేది భాజపా ఆలోచన. మోదీ పదేళ్లలో విమానాశ్రయాలు, పోర్టులు, భారీ పరిశ్రమలు విక్రయించారు. భాజపా కుట్రలను అడ్డుకునేందుకు ఇండియా కూటమి శాయశక్తులా పోరాడుతోంది. మోదీ పాలనలో కేవలం 2శాతం ఉన్న బిలియనీర్ల చేతిలోకి దేశ సంపద అంతా వెళ్తోంది. బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తెచ్చేందుకు మేం కృషి చేస్తున్నాం.

దేశంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించేందుకు గొప్ప పథకాన్ని రూపొందించాం. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక.. నిరుపేదలందరితో ఒక జాబితా రూపొందిస్తాం. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ పేరును ఎంపిక చేసుకుని వారి బ్యాంకు ఖాతాలో రూ.లక్ష డిపాజిట్ చేస్తాం” అని రాహుల్ గాంధీ తెలిపారు.

**ఇందిరాగాంధీ హయాంలోనే మెదక్ అభివృద్ధి..** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరారు. 1980లో మెదక్ నుంచి ఇందిరాగాంధీ ఘన విజయం సాధించారని, ఆమె ఎంపీగా ఉన్నప్పుడే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. భెల్, ఇతర పరిశ్రమలు ఈ ప్రాంతానికి వచ్చాయన్నారు. గత 25 ఏళ్లుగా మెదక్ లోక్‌సభ స్థానం భారాస, భాజపా చేతిలో చిక్కి నలిగిపోయిందని వ్యాఖ్యానించారు. దుబ్బాక ప్రజలను మోసం చేసిన వ్యక్తే మళ్లీ మెదక్ భాజపా ఎంపీ అభ్యర్థిగా ఉన్నారని ఎద్దేవా చేశారు. కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఈ ప్రాంత రైతులపై అక్రమ కేసులు పెట్టి హింసించిన భారాస ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఓడించి కేసీఆర్, హరీశ్‌రావుకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

## భైంసాలో కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో ఉద్రిక్తత

భైంసా: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ గురువారం నిర్మల్ జిల్లా భైంసాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పట్టణంలోని పాత చెక్‌పోస్ట్ కార్యాలయం కూడలి వద్ద కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఆ సమయంలో కొందరు కేటీఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఆయన వాహనంవైపు వెళ్లే



ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని నిలువరించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేటీఆర్ ప్రసంగిస్తుండగా.. జన సమూహంలో నుంచి కొందరు విసిరిన ఉల్లిగడ్డలు, టమాటాలు.. ప్రచార వాహనం సమీపంలో కిందపడ్డాయి. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీటింగ్ పూర్తయిన తర్వాత ఆందోళన కారులను పోలీసులు చెదరగొట్టారు.

## హెలికాప్టర్లో దుమ్మురేపుతున్న పార్టీలు

హైదరాబాద్ : అధికారంలో ఉన్నపార్టీకి డబ్బుకు లోటేముంటుంది ? అందుకనే ఎన్నికల ప్రచారంలో రోడ్డుమీద వెళ్ళటం కన్నా గాలిలో ప్రయాణంచేయటంపైనే ఎక్కువ ఇష్టపడుతుంది. ఇపుడు రేవంత్ రెడ్డి వ్యవహారం అలాగే ఉంది. రేవంత్ తో పాటు బీజేపీ కూడా అదే ఫాలో అవుతోంది. విషయం ఏమిటంటే ఎన్నికల ప్రచారంలో ఒకేరోజు మూడు, నాలుగు చోట్ల బహిరంగసభలు, రోడ్డుషోలు, ర్యాలీల్లో పాల్గొనాలంటే గాలిలో ప్రయాణంచేయటం ఒకటే మార్గం. అందుకనే హెలికాప్టర్లను అద్దెకు తీసేసుకుంటున్నాయి పార్టీలు. తెలంగాణా ఎన్నికల ప్రచారంలో రేవంత్ రోజుకు మూడు నాలుగు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. రోడ్డుమీద వెళితే గంటల పాటు సమయం వేస్టయిపోతుంది. అందుకని హెలికాప్టర్లోనే తిరిగేస్తున్నారు. ఎన్నికల ప్రచారం మొదలైన దగ్గరనుండి రేవంత్ రోడ్డుమీద ప్రయాణంచేసిందానికన్నా హెలికాప్టర్లో తిరిగిందే చాలా ఎక్కువ. అధికారంలో ఉన్న పదేళ్ళు కేసీయార్ చేసింది కూడా ఇదే. ఏ నియోజకవర్గంలో పర్యటించాలన్నా కేసీయార్ ఎక్కువగా హెలికాప్టర్నే ఉపయోగించేవారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీయార్ పార్టీ కోసమని ప్రత్యేకంగా ఒక విమానమే కొనబోతున్నట్లు జరిగిన ప్రచారం అందరికీ తెలిసిందే. అయితే ఏమైందో ఏమగాని ప్రత్యేకవిమానం కొనుగోలు చేయలేదు కాని హెలికాప్టర్లో మాత్రం విపరీతంగా తిరిగారు. ఇపుడు రేవంత్ అంతకుమించి తిరుగుతున్నారు. బీజేపీ అధ్యక్షుడు జీ కిషన్ రెడ్డి పెద్దగా హెలికాప్టర్ ను ఉపయోగించటంలేదు. నరేంద్రమోడి, అమిత్ షా తెలంగాణా పర్యటనకు వచ్చినపుడు మాత్రమే వాళ్ళతో హెలికాప్టర్లో వెళుతున్నారు. నిజానికి కిషన్ గ్రేటర్ హైదరాబాద్ వదిలి బయట నియోజకవర్గాల్లో చేసిన ప్రచారం కూడా తక్కువే. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 3 హెలికాప్టర్లను ఉపయోగిస్తోంది. ఇందులో ప్రత్యేకంగా రేవంత్ కోసమే ఒకటుంది. బయటనుండే వచ్చే రాహుల్ గాంధి, ప్రియాంకగాంధి, మల్లికార్జున ఖర్గే లాంటి వాళ్ళకోసం మిగిలిన రెండింటిని ఉపయోగిస్తున్నారు. అలాగే బీజేపీ రెండు హెలికాప్టర్లను ఉపయోగిస్తోంది. ఢిల్లీ, ముంబాయ్, బెంగుళూరుకు చెందిన సంస్థలు హెలికాప్టర్లను గంటల లెక్కన అద్దెకు ఇస్తున్నాయి. మోడల్ ను బట్టి సంస్థలు గంటకు రు. 4-6 లక్షలు అద్దె వసూలు చేస్తున్నాయి. కర్నాటకతో పాటు 11 రాష్ట్రాల్లో ఆదివారం నాడు పోలింగ్ ముగిసింది. కాబట్టి



వివిధ రాష్ట్రాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ ప్రముఖులు ప్రచారంకోసం తెలంగాణాలో పర్యటించబోతున్నారు. ఇందుకని రెండుపార్టీలు ముందుగానే మరో 4 హెలికాప్టర్లను అద్దెకు తీసుకున్నాయి. ప్రచారం కోసం కాంగ్రెస్, బీజేపీ పోటీలుపడి హెలికాప్టర్లను ఉపయోగిస్తుంటే బీఆర్ఎస్ అధినేత మాత్రం ఇప్పటివరకు ఒక్కసారి కూడా హెలికాప్టర్ ను ఉపయోగించలేదు. కేసీయార్ వ్యూహం ప్రకారం బస్సుయాత్రకే ప్రాధాన్యతిస్తున్నారు. ఛాపర్ ప్రయాణం ప్రధానంగా వాతావరణం మీద ఆధారపడుంది. మంచు ఎక్కువగా కురుస్తున్నా, వర్షాలు పడుతున్నా హెలికాప్టర్లో ప్రయాణం సాధ్యంకాదు. మోడల్ ను బట్టి గంటకు సగటున 250 కిలోమీటర్ల స్పీడుతో ప్రయాణంచేస్తాయి. డబల్ ఇంజన్ కెపాసిటి ఉండే హెలికాప్టర్లకు గంట ప్రయాణానికి 310 లీటర్ల ఇంధనం అవసరం. అలాగే సింగిల్ ఇంజన్ హెలికాప్టర్ కు గంట ప్రయాణానికి 150 లీటర్ల ఇంధనం కావాలి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క హెలికాప్టర్ను మాత్రమే వాడిన కాంగ్రెస్ పార్టీ ఇపుడు మూడింటిని వాడుతోంది. అగస్త్య-169, అగస్త్య -109, బెల్-429 వెరైటిలను ఉపయోగిస్తోంది. అగ్రనేతలు రాహుల్, ప్రియాంకకు బెల్-429 హెలికాప్టర్ను కేటాయించారు. ఇక బీజేపీ విషయానికి వస్తే నరేంద్రమోడి, అమిత్ షా తెలంగాణా పర్యటనల్లో ప్రత్యేక హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు. బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు తెలంగాణా ప్రచారం చేయటంకోసం కమలంపార్టీ అదనంగా మరో రెండు హెలికాప్టర్లను రప్పించబోతోంది. మొత్తంమీద ఎన్నికల ప్రచారం పేరుతో రెండు పార్టీలు హెలికాప్టర్ల వాడకంలో దుమ్ము రేపేస్తున్నాయి.

## తెలంగాణలో డబుల్ డిజిట్ పక్కా!

## అబద్ధాలతో గెలవాలని కాంగ్రెస్ ప్రయత్నం: అమిత్‌షా




భువనగిరి: ‘రాహుల్ పిల్ల చేష్టల గ్యారంటీలు.. మోదీ గ్యారంటీల మధ్య జరుగుతున్న ఎన్నికలివి’ అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా తయారైందని, ఆ పార్టీ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా దొరకట్లేదని ఎద్దేవా చేశారు. మోదీ ఏం చెబుతారో దానిని తప్పకుండా చేస్తారని, రాహుల్ ఇచ్చిన గ్యారంటీలు అమలయ్యే పరిస్థితి లేదని అన్నారు. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. “ రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ అమలు కాలేదు. వారికి ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం ఇవ్వలేదు. వరి, గోధుమలకు రూ.500 బోనస్ అందించలేదు. కాంగ్రెస్ చేసిన వాగ్దానాలను ఎన్నటికీ నెరవేర్చదు. ఆ పార్టీ 70 ఏళ్లుగా అయోధ్య విషయాన్ని పక్కన పెట్టింది. నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ మధ్య జరుగుతున్న ఎన్నికలివి. కుటుంబ అభివృద్ధి- దేశవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధికి మధ్య ఎన్నికలు. మూడు విడతల్లో ఇప్పటికే 200 సీట్లకు పైగా స్థానాలు గెలుస్తాం. దేశవ్యాప్తంగా మొత్తం 400 లోక్‌సభ స్థానాలు సాధిస్తాం. తెలంగాణలో గత ఎన్నికల్లో 4 లోక్‌సభ సీట్లు గెలిచాం. ఈసారి 10కి పైగా గెలుస్తాం. రాష్ట్రంలో డబుల్ డిజిట్ స్కోర్‌తో దేశంలో 400 సీట్లకు మార్గం సుగమం అవుతుంది. అబద్ధాలతో ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ యత్నిస్తోంది.

**ఆ మూడు పార్టీల మధ్య త్రికోణ బంధం :** మోదీ మళ్లీ వస్తే రిజర్వేషన్లు తొలగిస్తారని అవాస్తవాలు చెబుతున్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ల ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు నష్టం వాటిల్లుతుంది. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. రాజస్థాన్, తెలంగాణ ప్రజలకు కశ్మీర్‌తో ఏం సంబంధమని ఖర్గే ప్రశ్నించారు. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌లో త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా చేశాం. ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని మోదీ పరిసమాప్తం చేశారు. దేశాన్ని సురక్షితంగా ఉంచారు.

కాంగ్రెస్, భారాస, మజ్లిస్ మధ్య త్రికోణ బంధం ఉంది. మూడు పార్టీలు హైదరాబాద్ విమోచన దినోత్సవం నిర్వహించవు. రద్దు చేసిన ట్రిపుల్ తలాక్‌ను పునరుద్ధరించేందుకు యత్నిస్తున్నారు.

**భారాస హయాంలో కుటుంబమే బాగుపడింది :** భువనగిరి టెక్స్‌టైల్ పరిశ్రమల కోసం మోదీ కృషి చేశారు. రూ.1500 కోట్లతో జాతీయ టెక్స్‌టైల్ విధానం అమల్లోకి తెచ్చాం. భువనగిరి నుంచి భూపాలపల్లి వరకు జాతీయ రహదారి నిర్మించాం. బీబీ నగర్ ఎయిమ్స్ నిర్మించి పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. జనగామ నుంచి భువనగిరి వరకు రైల్వే లైన్ల ఆధునికీకరణ చేపట్టాం. కొమురవెల్లిలో అత్యాధునిక రైల్వే స్టేషన్ నిర్మిస్తున్నాం. భారాస ప్రభుత్వ హయాంలో కుటుంబం మాత్రమే బాగుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను ఏటీఎంగా వాడుకుంటోంది” అని అమిత్‌షా విమర్శించారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ఖర్చు చూస్తే కళ్లు తిరగాల్సిందే.. ధన సునామీ దిశగా 2024 ఎన్నికలు..!

కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ లేనివిధంగా ఎండలు కుమ్మేస్తున్నాయి. అయినా వేడిని సైతం లెక్కచేయకుండా పార్టీలు బ్యాలెట్ పోరులో మునిగిపోయాయి. ఈసారి ఎండలే కాదు.. ఎన్నికల ఖర్చూ తీవ్రంగానే ఉండనుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే స్వయంగా దేశ ఆర్థికమంత్రే 'నా దగ్గర అంత సొమ్ము లేదు' అందుకే లోక్‌సభకు పోటీ చేయనని చేతులెత్తేశారంటే ఖర్చును అర్థం చేసుకోవచ్చు. ప్రతీ ఐదేళ్లకు ఖర్చు కనీసం 50 నుంచి 100 శాతానికి పైగా పెరుగుతోందని ఎన్నికల ట్రెండ్ స్పష్టంగా చెబుతోంది. 2004లో నాటి ప్రధాని వాజ్‌పేయి ఓ సందర్భంలో 'జనతంత్రం.. ధనతంత్రంగా మారుతోంది' అని ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన దాదాపు 1957 నుంచి ప్రజాజీవితంలో ఉన్నారు. ఇప్పుడు ఆయన మాటలే వాస్తవంగా మారాయి.

**ఎన్నికల కమిషన్‌కు సమర్పించే ఖర్చే పెరుగుతుంటే.. అసలెంతో..! :** అభ్యర్థుల వాస్తవ వ్యయం.. ఎన్నికల కమిషన్‌కు సమర్పించే లెక్కల్లో చాలా వ్యత్యాసం ఉంటుందన్నది జగమెరిగిన వాస్తవం. ఈసీకి సమర్పించిన లెక్కల ప్రకారం 2019 లోక్‌సభ ఎన్నికల్లో సగటున ఒక్కో ఎంపీ రూ.50 లక్షలు వెచ్చించారు. 2014తో పోలిస్తే ఇది 25శాతం అధికం. అదే 2009తో పోలిస్తే 67 శాతం ఎక్కువని ఏడీఆర్ సంస్థ చెబుతోంది. 2019 లోక్‌సభలో 474 మంది ఎంపీల ఆస్తులు రూ.కోటి కంటే ఎక్కువ. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన మొత్తాలు కాకుండా అభ్యర్థులు వెచ్చించినట్లు సమర్పించే సగటు వ్యయమే 2009లో రూ.30 లక్షలు, 2014లో రూ.40 లక్షలుగా ఉంది. ఆ ఏడాది ఈసీ విధించిన అత్యధిక పరిమితి అభ్యర్థికి రూ.95 లక్షలు. ముఖ్యంగా రాజకీయ పార్టీల వ్యయాలపై నియంత్రణ లేదు. దీంతో ఆ నిబంధనను తెలివిగా వాడుకొంటున్నారు. ప్రతీ నియోజకవర్గంలో దానికింద ఎక్కువ ఖర్చులు చూపిస్తున్నారు. 2014 ఎన్నికల్లో పార్టీల డిక్లరేషన్ల ప్రకారం భాజపా రూ.755 కోట్లు వెచ్చించగా.. కాంగ్రెస్ రూ.488 కోట్లు ఖర్చు పెట్టింది. నాయకులు, పార్టీలు వెల్లడించే మొత్తాలు అసలు ఖర్చుతో పోలిస్తే సముద్రంలో నీటిబొట్టుతో సమానమని నిపుణులు చెబుతున్నారు.

**ప్రతిసారీ కొత్త రికార్డులే..** 2019 ఎన్నికల ఖర్చు రికార్డులు ఈసారి బద్దలయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. గత 20 ఏళ్లలో వాస్తవిక ఎన్నికల వ్యయం దాదాపు 500 శాతానికి పైగా పెరిగిపోయింది. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అంచనా ప్రకారం 1999లో రూ.10,000 కోట్లు కాగా.. అది 2019 నాటికి రూ.55,000 కోట్ల నుంచి రూ.60,000 కోట్లకు చేరింది.

**కారణాలు అనేకం..** ఎన్నికల ఖర్చులు పెరగడానికి కొన్ని సహేతుక కారణాలూ ఉన్నాయి. 1951లో తొలి ఎన్నికల వేళ ఒక్కో ఎంపీ దాదాపు 8 లక్షల మందికి ప్రాతినిధ్యం వహించగా.. ఇప్పుడా సంఖ్య 20 లక్షలను దాటిపోయినట్లు అంచనాలు ఉన్నాయి. 1970 నుంచి పార్లమెంట్ స్థానాల సంఖ్య స్థిరంగా ఉండిపోవడం కూడా దీనికి మరో కారణం. దీంతో ఓటర్లందరిని చేరడానికి అభ్యర్థి ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఈక్రమంలో పోటీ కూడా పెరగడంతో.. ప్రత్యర్థులతో పోలిస్తే ప్రచారంలో ముందుండేందుకు అభ్యర్థులే విచ్చలవిడిగా ఖర్చు పెట్టాల్సివస్తోంది. చేతి ఖర్చులు, పోస్టర్లు, స్పీకర్లు, వాహనాలు, భోజనాలు ఇలా చెప్పుకొంటూ పోతే ఆ జాబితా చాలా ఉంటుంది. మరోవైపు పార్టీలు మాత్రం రాష్ట్ర శాఖలకు సొమ్ము పంపి.. మీడియా, ఇతర మాధ్యమాల్లో ప్రచారం చేస్తాయి. ఇప్పుడు ఖరీదైన పార్టీ వ్యూహకర్తలు, డిజిటల్ విభాగాలు దీనికి తోడయ్యాయి. 2019లో భాజపా గూగుల్ యాడ్స్‌కు రూ.12 కోట్లు వెచ్చించగా.. డీఎంకే రూ.4 కోట్లు, కాంగ్రెస్ రూ.3 కోట్లు చెల్లించాయి. ఈ ఖర్చు మెల్లగా పెరుగుతూ వస్తోంది. 2023 ఏప్రిల్ 1 నాటికి కమలం పార్టీ రూ.42 కోట్లు, హస్తం పార్టీ రూ.19 కోట్లు వెచ్చించాయి.

**సోషల్ మీడియా యుగం..** భారత్‌లో దాదాపు 65 కోట్ల స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. అంటే వీరిలో చాలామంది సోషల్ మీడియాను అనుసరిస్తుండే అవకాశాలున్నాయి. 2019 నుంచి పార్టీలు ఈ మాధ్యమాలపైనా దృష్టిపెట్టాయి. ఆ ఎన్నికల్లో భాజపా ఫేస్‌బుక్‌కు రూ.6 కోట్ల విలువైన ప్రకటనలు ఇస్తే.. కాంగ్రెస్ రూ.1.45 కోట్లు చెల్లించి ప్రచారం చేసింది. 2024 నాటికి దాదాపు 36 కోట్ల మంది భారతీయులు ఫేస్‌బుక్ వాడుతున్నారు. దీంతో వారిని చేరడానికి పార్టీలు ఈసారి మరింత తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. అభ్యర్థుల వ్యక్తిగత సోషల్ మీడియా బృందాలు, పార్టీ స్థానిక, జాతీయశాఖల యూనిట్లు, పరోక్షంగా మద్దతు ఇచ్చేందుకు సోషల్‌మీడియా సైన్యాలను తయారుచేసుకొన్నాయి. ఇప్పుడివి ప్రజాభిప్రాయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరాయి.

**కోటీశ్వరులు క్రమంగా పెరుగుతున్నారా..? :**
లోక్‌సభలో క్రమంగా కోటీశ్వరుల సంఖ్య పెరుగుతోంది. 2004లో రూ. కోటి ఆస్తి ఉన్నవారు 153 మంది ఉండగా.. 2009 నాటికి 302కు చేరింది. 2014లో 442, 2019లో 472 మంది ఆస్తి రూ. కోటికి పైగానే ఉంది. 2009లో తొలిసారి లోక్‌సభలో రూ.100 కోట్లు అంతకుమించి ఆస్తి ఉన్నవారు ఎన్నికయ్యారు. 2019 నాటికి వీరి సంఖ్య 26కు చేరింది.

# రైతుల పేరు... దళారుల జోరు



ఆదిలాబాద్ : అన్నదాతలకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం జొన్నలను కొనుగోలు చేస్తుంటే ఇదే అదనుగా దళారులు రైతుల పేరున విక్రయించి అక్రమాలకు పాల్పడుతున్నారు. పంటఉత్పత్తుల కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతుండటంతో ప్రభుత్వం మూడేళ్లుగా సమగ్ర సర్వేను ప్రతిపాదికగా తీసుకుంటోంది. అయినా సర్వే సమయంలోనే కొంతమంది రైతులు పంటను సాగు చేయకపోయినా.. జొన్న సాగు చేసినట్లుగా చూపారు. అలాంటి రైతులకు కొంత కమీషన్ ఆశచూపి వారి పేరున మద్దతు ధరతో పంటను విక్రయించి అక్రమాలకు పాల్పడుతున్నారు. స్థానిక దళారులు ఆంధ్రా, మహారాష్ట్ర నుంచి తక్కువ ధరతో జొన్నలు కొనుగోలు చేసి, ఇక్కడి రైతుల పేరుతో మద్దతు ధరతో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది జొన్న పంట కొంత ఆశాజనకంగా ఉంది. దిగుబడులు రావడం, మద్దతు ధర ఎక్కువగా ఉండటంతో లాభాలొస్తాయని రైతులు ఆశపడ్డారు. తీరా పంట విక్రయించే సమయంలో మార్కెట్లో ధర తగ్గడంతో ఆందోళనలో మునిగారు. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు కేంద్రాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో 9 కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రారంభంలో కొనుగోళ్లపై పరిమితి విధించారు. ఎకరానికి 8.80 క్వింటాళ్లకు మించి కొనొద్దని ఆదేశాల్లో పేర్కొన్నారు. జిల్లా మొత్తంలో 66 వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు అనుమతి ఇవ్వాలని కోరడంతో.. తాజాగా ప్రభుత్వం 12 క్వింటాళ్ల వరకు అనుమతి ఇస్తున్నట్లు మార్కెట్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు.

పక్కాగా నిబంధనలు

ప్రభుత్వ కేంద్రాల్లో పంటను విక్రయించాలంటే యాసంగిలో అధికారులు చేపట్టిన సర్వేలో రైతులు ఎన్ని ఎకరాల్లో జొన్న పంటను చేశారనేది ఆన్‌లైన్‌లో నమోదై ఉండాలి. రైతు మూడు ఎకరాల్లో జొన్న పంటను సాగు చేస్తే ప్రభుత్వ నిబంధనల మేరకు 36 క్వింటాళ్ల వరకు విక్రయించుకునే వీలుంది. రైతుల పేర్లు పొరపాటున ఆన్‌లైన్‌లో నమోదై లేకుంటే.. సాగు చేసినట్లుగా వ్యవసాయాధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. అదే కౌలుదార్లకు సంబంధిత రైతు సంతకంతోపాటు వ్యవసాయాధికారి ధ్రువీకరిస్తే.. వాస్తవ సాగుదారు పేరున పంటను కొనుగోలు చేసే అవకాశం ఉంది.

జరుగుతోంది ఇలా..మార్కెట్లో తక్కువ, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఎక్కువగా ఉండటంతో దళారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రారంభం నుంచే కొంతమంది ఒక ప్రణాళిక ప్రకారం ఈ వ్యవహారాన్ని నడిపినట్లు తెలుస్తోంది. ముందు జాగ్రత్తగా కొంతమంది దళారులు తమకు తెలిసిన రైతులతో వాళ్లు పంట సాగు చేయకపోయినా.. జొన్న సాగు చేసినట్లుగా అధికారులతో ఆన్‌లైన్‌లో చేయించారు. తాజాగా వారి పేర్లతోనే దళారులు పంటను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మరికొంతమంది వ్యవసాయ విస్తరణాధికారులతో కుమ్మక్కై పంట సాగు చేసినట్లుగా తెలిసిన రైతుల పేరున ధ్రువీకరణ పత్రం తీసుకొని వాళ్ల పేరుతో పంటను విక్రయిస్తున్నారు.

ఈ విషయమై మార్కెట్ ఏడీ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో రైతుల పేరు ఉంటేనే పంటను కొనుగోలు చేస్తున్నామన్నారు. దళారులు అక్రమంగా విక్రయించేందుకు రైతులు అవకాశం ఇవ్వొద్దని ఆయన సూచించారు.

ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు : రూ. 3,180
ప్రైవేటులో : రూ. 2,600

# తప్పు వారిది.. శిక్ష వీరికి!



ఆసిఫాబాద్: జాతీయ అర్హత పరీక్ష (నీట్) ప్రశ్నపత్రాల తారుమారు వ్యవహారంలో ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) అధికారులు, పాఠశాల ప్రిన్సిపల్ నిర్లక్ష్యం ఉన్నట్లుగా స్పష్టమవుతోంది. ఇక్కడ పరీక్ష రాసిన విద్యార్థుల జవాబు పత్రాలను సైతం దిద్దుతామని, మార్కులు, ర్యాంకులు కేటాయిస్తామని అధికారులు చెబుతున్నా.. ఏ విధంగా ర్యాంక్ ఇస్తారోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు సెట్ల ప్రశ్నపత్రాలు వేర్వేరుగా ఉండడంతో కీ పేపర్ విడుదలైతే తప్ప ఎన్ని మార్కులు వస్తాయో తెలియదని విద్యార్థులు చెబుతున్నారు. రెండు ప్రశ్నపత్రాలు కఠినంగా ఉన్నా, ఎవరి ప్రతిభ అనుసరించి వారికి మార్కులు వస్తాయని, ఒక్క మార్కుతో వేలల్లో ర్యాంకులు మారుతాయని వారంతా ఆందోళనకు గురవుతున్నారు.

ఎన్టీఏ అధికారులు జిల్లాలో ఉన్న అధికారులను ఎవరినీ సంప్రదించకుండా కనీసం, పరీక్షల నిర్వహణపై ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే ప్రైవేటు పాఠశాలలో నీట్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. ఇన్విజిలేటర్స్‌గా ప్రైవేటు ఉపాధ్యాయులే ఉన్నారు. ఎన్టీఏ అధికారులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి సైతం సదరు పాఠశాల సిబ్బంది హాజరుకాలేదు. తరచూ నిర్వహించే జూమ్ మీటింగుల్లో సైతం వీరు పాల్గొనలేదని సమాచారం. పరీక్షల నిర్వహణ తీరుపై అవగాహనలేకే విద్యార్థులను గందరగోళానికి గురిచేశారని వారి భవిష్యత్తును అగమ్యగోచరం చేశారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కఠినంగా..

దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ 'జీఆర్ఐడీయూ' కోడ్‌తో ఉన్న ప్రశ్నపత్రంలో పరీక్ష నిర్వహించగా.. ఆసిఫాబాద్‌లో 'ఎన్ఏజీఎన్‌యూ' కోడ్‌తో ఉన్న ప్రశ్నపత్రం ఇచ్చారు. పరీక్ష రాసిన చాలా మంది విద్యార్థులు మిగతా జిల్లాల పరీక్ష పత్రాల ప్రశ్నలతో పోల్చుతూ ఇవి కఠినంగా వచ్చాయని, రెండు, మూడు ప్రశ్నలు సిలబస్‌లో లేనివి ఇచ్చారని, ఈ ప్రభావం ర్యాంక్‌పై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకుని, పరీక్ష రాస్తే ఈ విధంగా చేశారని, న్యాయం జరిగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రెండేళ్ల నుంచి కష్టపడి చదువుతున్నా: పల్లెర్ల అమూల్య, ఆసిఫాబాద్
రెండేళ్ల నుంచి హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుని చదువుతున్నా. నాన్న అప్పులు తెచ్చి కోచింగ్ ఇప్పించారు. నేను రాసిన పరీక్ష కఠినంగా ఉంది. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

నష్టపోకుండా చూడాలి: నయన్, ఆసిఫాబాద్
నేను ఆసిఫాబాద్‌లో రాసిన నీట్ పరీక్ష చాలా కఠినంగా ఉంది. కొన్ని ప్రశ్నలు సిలబస్‌లో లేనివి వచ్చాయి. పరీక్ష నిర్వహణలో ఎక్కడ పొరపాటు జరిగిందో కాని ప్రతిభ గల విద్యార్థులు నష్టపోకుండా అధికారులు చూడాలి.

# లారీల కొరత.. అన్నదాతకు వెత

మంచిర్యాల : కొనుగోలు కేంద్రాలనుంచి వెంటవెంట ధాన్యం తరలించకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్రాల్లో తూకం వేసినప్పటికీ లారీల కొరతతో తరలింపులో జాప్యమవుతోంది. మిల్లుల్లో ధాన్యాన్ని దించుకోకపోవడంతో రోజుల తరబడి అక్కడే నిరీక్షించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ధాన్యంలో తప్ప, తాలు, విరిగిన నూక వస్తోందనే నెపంతో మిల్లర్లు కొర్రీలు పెడుతూ దించుకోవడం లేదు. అసలే లారీలు తక్కువగా ఉన్నాయంటే దీనికితోడు మిల్లర్లు వెంటనే దించుకోకపోవడం సమస్యగా మారింది. లారీలురాక కేంద్రాల్లో బస్తాల నిల్వలు పేరుకుపోతున్నాయి. మిల్లులకు లారీలు చేరుకున్న తరువాత ధాన్యం దించుకోకపోవడంతో వెనుకకు రావడం లేదు. దీంతో కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది.

పదిరోజులుగా వరికోతలు ముమ్మరంగా సాగుతుండటంతో కేంద్రాలకు ధాన్యం విరివిగా వస్తోంది. అయితే కేంద్రాల్లో అప్పటికే తూకం వేసిన ధాన్యం నిల్వలు ఉండటంతో ఆరబోసేందుకు స్థలంలేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని హాజీపూర్, భీమారం, జైపూర్, చెన్నూరు, భీమిని, కన్నేపల్లి, లక్షెట్టిపేట, దండేపల్లి తదితర మండలాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. వెంటవెంట ధాన్యం తరలించి మిల్లుల్లో దించుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటేనే రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

అంతా సాధారణ రకమే..

ధాన్యాన్ని రెండు రకాలుగా విభజించి ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది. 'ఏ'రకం క్వింటాలుకు రూ.2203 మద్దతు ధర ఉండగా.. సాధారణ రకం 'బీ' రకానికి రూ. 2183 మద్దతు ధర ఉంది. అయితే మిల్లుల్లో మొత్తం బీ రకం కిందే తీసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 'ఏ' రకాన్ని కూడా 'బీ' కిందే కొనుగోలు చేయడంతో తాము క్వింటాలుకు రూ. 20 నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటవెంటనే తరలించేలా చర్యలు: వాజీద్, జిల్లా పౌరసరఫరాల అధికారి, మంచిర్యాల
జిల్లాలో మిల్లుల సామర్థ్యం తక్కువగా ఉండటంతో ఆలస్యం అవుతోంది. పెద్దపల్లి జిల్లా మిల్లర్లతో మాట్లాడాం. ఇక్కడి మిల్లులకు ట్యాగింగ్ చేసి వెంటవెంటనే తరలించేలా చర్యలు తీసుకుంటాం. మిల్లుల్లో ఆలస్యం చేయకుండా త్వరగా దించుకునేలా చూస్తాం.

వారం రోజులుగా ధాన్యం కేంద్రంలోనే: తిరుపతి, రైతు, వందూర్‌గూడ
నాకు రెండెకరాల పొలం ఉంది. వారం రోజుల కింద ధాన్యం కేంద్రంలో పోశాను. ఇప్పటికీ తూకం కాలేదు. తేమ రాలేదని ఇప్పటి వరకు తూకం వేస్తలేరు. వారం రోజులుగా ఇక్కడే ఉండాల్సి వస్తోంది. వెంటనే తూకం వేసి ధాన్యం తరలించేలా చూడాలి.

# ఇటు తనిఖీలు.. అటు దోస్త్ నోటిఫికేషన్

కామారెడ్డి : తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలలకు 2024-25 విద్యా సంవత్సరానికి 'యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు' ఇచ్చేందుకు తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. సౌకర్యాలు లేని కళాశాలల్లో వాటి కల్పన కోసం నెల రోజుల గడువు ఇస్తున్నారు. ఈ క్రమంలోనే డిగ్రీ ప్రవేశాలకు 'దోస్త్' నోటిఫికేషన్ విడుదల కావడం గమనార్హం. యూజీసీ, ఉన్నత విద్యామండలి, యూనివర్సిటీ నిబంధనలకు లోబడిన కళాశాలలకే 'వర్సిటీ అఫిలియేషన్' ఇస్తామని వర్సిటీ అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు నిబంధనలు, ప్రమాణాలు పాటించిన వాటికి మాత్రమే 'దోస్త్'లో ప్రవేశాలకు అనుమతి ఇస్తామన్నారు. అయితే ఇటు కళాశాలల తనిఖీలు జరుగుతుండగానే.. అటు డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ నోటిఫికేషన్ విడుదలైంది. వర్సిటీ పరిధిలో 54 ప్రైవేటు డిగ్రీ కళాశాలలుండగా.. దాదాపు 30 కళాశాలల్లో కనీస సౌకర్యాలు లేవని తనిఖీల్లో తేలినట్లు



ఓ అధికారి చెప్పడం గమనార్హం. ఏటా తనిఖీలు నిర్వహించడం, సౌకర్యాలు కల్పించాలని సూచించడం పరిపాటిగా మారింది. కొన్ని సందర్భాల్లో డిగ్రీ అడ్మిషన్లు పూర్తయ్యాక తనిఖీలు నిర్వహించిన పరిస్థితులున్నాయి. ప్రైవేటు వారు ప్రవేశాలపై చూపిన శ్రద్ధ, కనీస సౌకర్యాల కల్పన, విద్యార్థులకు బోధన అందించడంలో చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంకా కొన్ని కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లో నడుస్తూ ప్రముఖ కళాశాలలుగా చలామణి అవుతుండడం కొసమెరుపు. నగరంలోని ఓ ప్రముఖ ప్రైవేటు కళాశాల ఇబ్బడి ముబ్బడిగా కొత్త కోర్సులు తెచ్చుకుంటుంది. కానీ సరిపడా తరగతి గదులు, ల్యాబ్‌లు ఉన్నాయా.? అని ఆలోచించడం లేదు. ప్రైవేటు కళాశాలలు అడిగిందే తడవుగా ఉన్నత విద్యా మండలి కొత్త కోర్సులు, సెక్షన్లను ఇస్తోందని విద్యావేత్తలు వాపోతున్నారు. అనుబంధ గుర్తింపు తనిఖీలు పూర్తయిన తర్వాతే 'దోస్త్' నోటిఫికేషన్ ఇస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉన్నత విద్యామండలి ఇష్టారాజ్యంగా అడ్మిషన్లు ఇవ్వడంతో యూనివర్సిటీ పాత్ర నామమాత్రంగా మారుతోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# దావత్ కావాలా నాయనా!..

## వ్యవసాయ క్షేత్రాల్లో కార్యకర్తల ఖుషీ

గజ్వేల్ : ఎన్నికల పండుగొచ్చింది.. దావత్‌ల మీద దావత్‌లు ఏర్పాటవుతున్నాయి. కార్యకర్తలను మచ్చిక చేసుకోవడానికి, ప్రచారంలో జోరు ఉండటానికి నాయకులు విందు కార్యక్రమాలను ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా యువతకు ఇష్టమైన విందులతో జిల్లాలోని ఫాంహౌజ్‌లు రద్దీగా ఉంటున్నాయి. కొందరు స్థానికులు, హైదరాబాద్ జంటనగరాలు, ఇతర పట్టణాలకు చెందిన వ్యాపారులు వారాంతపు సెలవు రోజుల్లో సేదదీరడానికి ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ క్షేత్రాలు (ఫాంహౌజ్) ప్రస్తుతం ఎన్నికల సందర్భంగా రాజకీయ వేదికలుగా మారుతున్నాయి. స్నేహితులు, బంధువులు, కార్యకర్తల పుట్టిన రోజు, పెళ్లి రోజు లాంటి సందర్భాలు ఎంచుకొని వ్యవసాయ క్షేత్రాల్లో నాయకులు దావత్‌లు చేపడుతున్నారు. సమావేశమై రాబోయే రోజుల్లో ప్రచార వ్యూహాన్ని అక్కడే చర్చిస్తున్నారు.

సకల సౌకర్యాలతో సేద తీరుతూ..

కార్యకర్తలను ఖుషీ చేయడానికి.. ఉదయం, సాయంత్రం ఇంటింటా ప్రచారం సాగిస్తున్న నేతలు ఇక్కడ మధ్యాహ్నం పూట విందులు చేసుకుంటున్నారు. గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాలు పట్టణానికి చేరువలో ఉండటంతో ఇక్కడ చాలా చోట్ల రోడ్లకు దగ్గరగా ఫాంహౌజ్‌లున్నాయి. వీటిలో సకల సౌకర్యాలు ఉంటాయి. ఎండ వేడిమి నేపథ్యంలో పొలాల మధ్య సేదతీరేందుకు ఇష్టపడుతున్నారు.



పార్టీల వ్యూహ రచనలు బయటకు పొక్కకుండా ఈ క్షేత్రాలు ఉపయోగపడుతున్నాయి. రాజకీయ ప్రముఖులు వచ్చినపుడు విడిది చేస్తున్నారు. కార్యకర్తలు వారిని కలుస్తున్నారు.

కిట్టీ పార్టీల్లోనూ సమీక్ష

సాధారణ రోజుల్లో పైసా ఇవ్వని నాయకులు సైతం విందుల పేరుతో రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. రోజూ కార్యకర్తలు విందుల్లో తేలియాడుతున్నారు. గజ్వేల్‌లోని ఓ నాయకునికి చెందిన ఫాంహౌజ్‌లో ఇటీవలే పుట్టిన రోజు వేడుక పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇక్కడికి బంధువుల కంటే ఎక్కువగా కార్యకర్తలే హాజరయ్యారు. దుబ్బాకలో ఓ పార్టీకి చెందిన నేత పుట్టిన రోజును పురస్కరించుకుని ఆస్పత్రిల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసిన తరువాత ఓ ఫాంహౌజ్ వద్ద విందు ఏర్పాటు చేశారు. రాత్రి పొద్దుపోయే వరకు అక్కడే సేద తీరినట్లు స్థానికులు చెబుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో కిట్టి పార్టీలు జరుగుతున్నాయి. ఒక్కో పార్టీలో 150 మంది వరకు సభ్యులున్నారు. ప్రతి నెల కొంత నగదు జమ కడుతూ ప్రతి నెల పార్టీ నిర్వహిస్తున్నారు. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల సందర్భాన్ని చూసుకుని రెండ్రోజుల కోసారి బృంద సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకుని ఎన్నికలపై సమీక్షిస్తున్నారు. ముందుగానే చెల్లింపులు పలువురు నేతలు కొన్ని మద్యం దుకాణాలు, బిర్యానీ సెంటర్లకు సరుకు కోసం ముందుగానే చెల్లింపులు చేసినట్టు సమాచారం. మండిపోతున్న ఎండల కారణంగా డిమాండ్ పెరగడంతో మద్యం దుకాణాల్లో నిల్వల కొరత ఏర్పడుతోంది. గ్రహించిన నాయకులు ముందుగానే చెల్లింపులు చేస్తున్నారు. గతంలో ఓ దుకాణంలో రోజూ 120 కేసుల మద్యం వచ్చేది. ప్రస్తుతం 40 కేసులే వస్తున్నాయి. వాటినీ ముందస్తు చెల్లింపుదారులకు ఇస్తున్నారు. బిర్యానీ గతంలో 40 నుంచి 60 వరకు పొట్లాలు అమ్ముడయ్యేవి. ప్రస్తుతం 120 వరకు రోజూ ఓ హోటల్ నిర్వాహకుడు చెప్పారు.

# నిరంత విద్యుత్తుకు.. కమాండ్ కంట్రోల్ సెంటర్

హైదరాబాద్: నగరంలో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉంది. అగ్నిమాపక కమాండ్ కంట్రోల్ సెంటర్ సైతం సిద్ధమవుతోంది. ఈ తరహాలోనే సిటీలో వేసవి డిమాండ్ దృష్ట్యా విద్యుత్తు పంపిణీ సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుచేసి కరెంటు సరఫరాను నిరంతరాయంగా పర్యవేక్షిస్తోంది.

నగరంలో 44 డిగ్రీల స్థాయిలో ఉష్ణోగ్రతల నమోదుతో పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు పనిచేస్తూనే ఉన్నాయి. వాటిని మధ్యమధ్యలో ఆపుతూ, వేస్తూ ఉన్నారు. దీంతో వినియోగంలో హెచ్చుతగ్గులతో గ్రిడ్‌ను నిర్వహించడం విద్యుత్తు ఇంజినీర్లకు సవాల్‌గా మారింది. ఓవర్‌లోడ్‌తో కొన్నిచోట్ల, ఇతరత్రా కారణాలతో పలు ప్రాంతాల్లో రోజుకు మూడు నుంచి ఏడెనిమిదిసార్లు కరెంట్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. కరెంట్ వెంటనే వస్తున్నా.. ఎక్కువసార్లు ట్రిప్పింగ్‌తో వినియోగదారులకు చికాకులు తెప్పిస్తోంది. గతంతో పోలిస్తే సరఫరా వ్యవస్థ మెరుగైనా.. ఇలాంటి సమస్యలపై ఫిర్యాదులు డిస్కంకు ఇబ్బందికరంగా మారాయి. ట్విటర్‌లో వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించేలా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని ఒక విభాగం పనిచేస్తోంది. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తూ.. క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేస్తోంది. ఎవరైనా తప్పుడు ఫిర్యాదులు



చేస్తే పోలీసుల దృష్టికి తీసుకెళుతున్నారు. వార్‌రూమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. మరోవైపు, విధి నిర్వాహణలో ఇంజినీర్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే సస్పెండ్ చేసేందుకూ సీఎండీ వెనకాడటం లేదు.

తొలిసారిగా ఇలా..విద్యుత్తు వినియోగం 90 మిలియన్ యూనిట్లు దాటి వంద మి.యూ. దిశగా పరుగులు తీస్తుండటంతో డిస్కం యాజమాన్యం మరింత అప్రమత్తమైంది. 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉండటం.. ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉండటంతో మొత్తం విద్యుత్తు సిబ్బందిని డిస్కం రంగంలోకి దించింది. ఇదివరకు క్షేత్రస్థాయిలో పనిచేసే ఇంజినీర్లు, సిబ్బందే సరఫరా పర్యవేక్షణతోపాటు మరమ్మతుల విధుల్లో పాల్గొనేవారు. డిమాండ్ దృష్ట్యా.. ప్రతి 11కేవీ ఫీడర్‌కు షిఫ్ట్‌లవారీగా ఒక ఇంజినీర్‌ను ఇంఛార్జిగా నియమించారు. వారితోపాటూ అకౌంటిం గ్ సిబ్బందికి సైతం ఆపరేషన్ విధులు అప్పగించాలని నిర్ణయించారు. కరెంట్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడటమే వారి ప్రధాన విధి.

# నేతల నోట.. తీయటి మాట

బోధన్ : నిజాం సుగర్స్.. ఆసియాలోనే అతిపెద్ద చక్కెర కర్మాగారంగా పాఠ్య పుస్తకాల్లో పారిశ్రామిక గుర్తింపు. తెలంగాణకే తలమానికంగా భౌగోళిక ప్రత్యేకత. ఉద్యమ కాలంలో తెలంగాణ అస్తిత్వం. ఇప్పుడు రాజకీయ నినాదం. ఇవీ పరిశ్రమ గురించి క్లుప్త విషయాలు.. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో నిజాం సుగర్స్ ప్రధాన పార్టీలకు ముఖ్య అజెండాగా మారింది. ప్రచారంలో పరిశ్రమ పేరు లేకుండా ముఖ్య నాయకులు, అభ్యర్థుల ప్రసంగాలు ముగియడం లేదంటే ప్రాముఖ్యం ఏర్పడిందో అర్థం చేసుకోవచ్చు. ఇదీ నేపథ్యం..

నిజాం కాలంలో ఏర్పాటైన చక్కెర కర్మాగారాల్లో బోధన్ చక్కెర పరిశ్రమ, ఆల్కహాల్, మెదక్, మెట్‌పల్లి యూనిట్లు మిగిలాయి. వాటిని 51 శాతం ప్రైవేట్, 49 శాతం ప్రభుత్వ వాటాతో నిజాం దక్కన్ సుగర్స్‌గా భాగస్వామ్య యాజమాన్యంగా మార్చారు. అలా 2002 నవంబర్ 1 నుంచి నిర్వహిస్తున్న భాగస్వామ్య యాజమాన్యంపై 2004లో ఏర్పాటైన సభాసంఘం కమిటీ ప్రభుత్వ స్వాధీనానికి సిఫార్సు చేసింది. అది అమలుకు నోచుకోకపోవడంతో పాటు రాష్ట్ర ఆవిర్భావం తదనంతర పరిణామాలతో 2015 డిసెంబర్‌లో యాజమాన్యం లేఆఫ్ ప్రకటించింది. పరిశ్రమ నిర్వహణ బాధ్యతలు రైతులు తీసుకుంటే ఆర్థికంగా ప్రభుత్వం నుంచి చేయూత అందిస్తామని నాటి సర్కారు ప్రకటించగా.. కర్షకులు విముఖత చూపారు. అప్పటి నుంచి కర్మాగారంపై అనిశ్చితి ఏర్పడింది.

ఎన్నికలతో తెరమీదకు..ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో ఉన్న పరిశ్రమకు చెందిన మూడు యూనిట్లలో రెండు (బోధన్, మెట్‌పల్లి) యూనిట్లు లోక్‌సభ పరిధిలో భారీ పరిశ్రమలు కావడంతో వాటి పునరుద్ధరణను ప్రధానాంశంగా తీసుకుంటున్నారు. పరిశ్రమను పునరుద్ధరిస్తామని 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించి అధికారంలోకి వచ్చాక ప్రక్రియను ప్రారంభించింది. ఈ మేరకు ప్రాథమికంగా రుణ బకాయిల చెల్లింపును పరిష్కరించాలని గుర్తించి ఇటీవల ఒక విడతగా రూ.43 కోట్లు చెల్లించినట్లు తెలుస్తోంది. తమ ప్రభుత్వం పునరుద్ధరణపై కట్టుబడి ఉందని కాంగ్రెస్ ఉద్ఘాటిస్తుండగా.. కేంద్ర సహకారంతో పునరుద్ధరించడానికి సిద్ధమని భాజపా ప్రకటించింది. ఇతర పార్టీలు ఇచ్చిన హామీలపై భారాస నిలదీస్తోంది.

మూడు యూనిట్ల గురించి క్లుప్తంగా..బోధన్‌లో 163 ఎకరాల్లో విస్తరించిన పరిశ్రమ సామర్థ్యం (గానుగాడించే) రోజుకు 3500 మె.ట. తర్వాత దీనిని 5 వేల మె.టకు విస్తరించారు. దాదాపు ఎనిమిది మండలాల పరిధిలో 15వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. రోజుకు 30వేల లీటర్లకు పైగా ఆల్కహాల్ ఉత్పత్తి డిస్టిలరీ ఉంది. 20 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశారు. వేలాది మంది చెరకు సాగు రైతులు పరిశ్రమకు అనుబంధంగా ఉంటారు. 300 మంది వరకు కార్మికులు ప్రత్యక్షంగా పనిచేస్తారు. ఇక్కడ క్వార్టర్లను కార్మికులకే విక్రయించారు.మెట్‌పల్లిలో 204 ఎకరాల్లో విస్తరించిన కర్మాగార సామర్థ్యం రోజుకు 2500 మె.ట. ఇక్కడ 120 ఫ్యాక్టరీ క్వార్టర్లు ఉన్నాయి. పర్మనెంట్ 200, సీజనల్ కార్మికులు 300 మంది. దాదాపు 4-5వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. ఇప్పటికీ అక్కడ చెరకు సాగు చేస్తున్న రైతులు వంద కి.మీ పరిధిలోని కామారెడ్డి పరిశ్రమకు తరలిస్తున్నారు. గత ఏడాది 1.20లక్షల మె.ట, ఈ సారి 98 వేల మె.ట చెరకు దిగుబడి అయిందని అధికారవర్గాల ద్వారా తెలిసింది. వచ్చే ఏడాదికి 60వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నట్లు సమాచారం. మెదక్‌లో 153 ఎకరాల్లో ఉన్న కర్మాగారం సామర్థ్యం రోజుకు 1800 మె.ట. 10-15 మండలాల పరిధిలో 4500 హెక్టార్లలో చెరకు సాగయ్యేది. ఇక్కడ 280 మంది కార్మికులుండేవారు. వారి కోసం నిర్మించిన 130 క్వార్టర్లు ఉన్నాయి.

# కేంద్రాలు దూరం.. సాయం అవసరం



పరిగి : పార్లమెంట్ ఎన్నికల తేదీ (ఈనెల 13) దగ్గరకొచ్చేస్తోంది.అయితే జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాల కల్పన ఇంకా కొలిక్కి రాలేదు. అసలే ఎండలు మండుతున్నాయి. దీంతో నిమిషం బయట నిలబడలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఓటింగ్ శాతం పెరగాలంటే సౌకర్యాల కల్పన తప్పనిసరి. తాగునీటి సదుపాయం, ఫ్యాన్లు, మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యాలపై ఇంకా దృష్టి సారించాల్సి ఉంది. పరిగిలోని ఓ పోలింగ్ కేంద్రం ముందు ఉన్న ర్యాంపు పట్టుకునేందుకు వీలు లేకుండా ఉంది. కనీసం వీల్‌ఛైర్‌తో వెళ్లలేని విధంగా ఉంది. ఇరువైపులా పైపులు అమర్చాల్సి ఉంది.

తండాల్లో కనిపించని పోలింగ్ కేంద్రాలు:మోమిన్‌పేట మండలంలో 38,638 మంది ఓటర్లు ఉండగా 48 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల పరిధిలో నూతనంగా ఏర్పడిన మక్తతండా గ్రామ పంచాయతీ ఓటర్లు రెండు కి.మీ దూరంలో ఉన్న టేకులపల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లి ఓటు వేయాలి. లచ్చనాయక్ తండాకు అనుబంధ తండాలైన మిట్యానాయక్, సోమ్లానాయక్ తండాల ఓటర్లు కి.మీ పైగా దూరంలో ఉన్న రాళ్లగుడుపల్లి కేంద్రానికి వెళ్లాలి. టేకులపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన సుదోడ్కతండా ఓటర్లు కిలోన్నర మీటరుకు దూరంగా ఉన్న గ్రామ పంచాయతీలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి. వీరికి రవాణా సౌకర్యం కూడా పెద్దలేదు. దీంతో అవస్థలు పడుతూ ఓటేయక తప్పదని వాపోతున్నారు.

ఈసారీ అంతే..

కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో మొత్తం 76 పోలింగ్ కేంద్రాలున్నాయి. మొత్తం 61,276 మంది ఓటర్లున్నారు. గతంలో మాదిరిగానే ఈమారు కూడా దూర ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఇబ్బందులు పడుతూ వెళ్లి ఓటేయక తప్పదని గ్రామాలు, తండాల ఓటర్లు వాపోతున్నారు. పరిస్థితి ఇలా ఉన్నా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఊసే లేకుండా పోయింది.

ః విఠలాపూర్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు ఉండగా ఒకటి ఈర్లవాగు తండాలో ఏర్పాటు చేశారు. దీనివల్ల 720 మందికి సౌకర్యం కాగా, మరో 330 మంది మళ్లీ విఠలాపూర్ వచ్చి ఓటు వేయాలి. ః పచావ్‌కుంట తండా, గుబ్బడితండా, లక్ష్మణ్ తండా తదితర తండాల వారు సుమారు 3 కి.మీ. దూరం వెళ్లాలి. విఠలాపూర్ వెళ్లేందుకు దారి అధ్వానంగా ఉంది. కనీసం ఆటోలు కూడా ఆ రూటులో వెళ్లలేవు.

ః ఎర్రగోవింద్ తండా గిరిజనులు రెండున్నర కిమీ. దూరంలోని రాంనగర్‌కు వెళ్లి ఓటేయాలి.ః టేకులతండా, ఎత్తుకాల్వ తండా, చెరువుముందలి తండా తదితర తండాల ప్రజలు కూడా సమీప గ్రామాలకే ఓటు వేసేందుకు వెళ్లాలి. ఎర్రటి ఎండా కాలంలో ఓటర్లు అవస్థలకు గురికావల్సిందేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు తగిన దృష్టి సారించాలని కోరుతున్నారు.

# మాట తప్పితే రాజీనామా చేస్తావా..!



మోత్కూరు : ప్రియమైన లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న అభ్యర్థికి సమస్కారం. ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యం.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలన్న తలంపు.. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతులు కల్పించాలన్న పట్టుదల.. నిరంతరం ప్రజల మధ్యన ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్న ఆలోచన.. ఇంకా.. ఎన్నో ఆలోచనలు, ఆశయాలతో పోటీ చేస్తున్నావు. నీ ఆస్తులు ప్రకటిస్తున్నావు.. అప్పులూ చెబుతున్నావు, కేసులూ వివరిస్తున్నావు.. ఎన్నికల సంఘం అడిగిన అన్నింటికీ తూ..చా.. తప్పక కట్టుబడి ఉంటానని హామీ పత్రం సమర్పిస్తున్నావు. ఇదంతా బాగానే ఉంది..ప్రచారం పేరుతో.. సభలు, సమావేశాలు, రోడ్‌షోలు.. వీటిని అట్టహాసంగా నిర్వహించేందుకు డప్పులు, కళాకారులు, మందీమార్బలం, హంగు, ఆర్భాటం, వాటి కోసం లెక్కకు మించి ఖర్చు చేస్తున్నావ్.. పార్టీ టికెట్ కోసం మీ అధిష్ఠాన పెద్దల్ని ప్రసన్నం చేసుకోవడం మొదలు.. 'కాసు'క్కూర్చున్న అసంతృప్తి నాయకుల్ని, ఎగస్పార్టీలోని నాయకుల్ని, చోటా, మోటా ప్రజాప్రతినిధుల్ని దారిలోకి తెచ్చుకున్నావ్. ఇక.. ప్రచారంలో పెద్ద నేతల్ని తీసుకువచ్చి కొత్త, కొత్త పథకాలు ప్రకటింపజేస్తున్నావ్. ఊరూరు, వాడవాడ తిరుగుతూ లెక్కకు మించిన, స్థోమతకు అందని హామీలిస్తున్నావ్, కుల సంఘాల్ని కూడగొడుతున్నావ్. మతాలను ఉపయోగించుకుంటున్నావ్. ఇతర పార్టీల కన్నా ఎక్కువ డబ్బులిచ్చి, మద్యమిచ్చి, కానుకలిచ్చి, ఏదడిగితే.. అదిచ్చి ఓటర్లను కొంటున్నవ్. దూరాన ఉన్న ఓటర్లకు ఖర్చులిచ్చి, వాహనాలు పెట్టి రప్పిస్తున్నావ్. ఓట్ల కోసం పడరాని పాట్లు పడుతున్నావ్. చేయరాని పనులు చేస్తున్నావ్.

ఇక గెలిచాక..

విజయోత్సవాల తరువాత కనిపించకుండా పోతున్నావ్. చోటా, మోటా నాయకులు కనిపించరు నీకు. ఓటర్లు అసలే కనిపించరు. ఊర్లకు రావు. మా బాధలు పట్టించుకోవు. మౌలిక వసతుల మాట మరిచిపోతావ్. హామీలూ గుర్తుండవ్. ప్రాంతాలనూ పట్టించుకోవు. పథకాలు ప్రకటనలకే పరిమితమవుతాయి. నీ పైరవీలు, నీ కాంట్రాక్టులు, నీ పనులు, నీ మేలు, నీ ఆదాయమే నువ్ చూసుకుంటావ్.

ఇలా కాదు..

ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు కాదు పంచాల్సింది. హామీలు అమలు చేయకపోతే.. మౌలిక సదుపాయాలు కల్పించకపోతే.. పథకాలు పక్కగా అమలు చేయకపోతే.. ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో తోడుండకపోతే.. నా పదవికి రాజీనామా చేస్తా. లేకపోతే ఓటింగ్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ (రీకాల్) చేసి, పదవీచ్యూతుడ్ని చేయండని బాండ్ పేపర్లు రాసి ఓటర్లకు పంచు. నీకే ఓట్లేసి గెలిపిస్తాం..నీ అభిమాన ఓటరు

సిరా గుర్తు వేసే వేలు లేకపోతే..?

పోలింగ్ రోజు ఓటరు ఓటేసినట్లు తెలిసేందుకు, అదే ఓటరు మళ్లీ ఓటు వేయకుండా ఉండేందుకు సిబ్బంది ఓటరు ఎడమ చేతి చూపుడు వేలికి సిరా గుర్తు పూస్తారు. ఈ సంగతి అందరికీ తెలిసిందే. కానీ.. ఓటరుకు ఎడమ చేతికి చూపుడు వేలు లేకపోతే ఏ వేలికి సిరా గుర్తు వేయాలో కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. మధ్య వేలికి, అదీ లేకపోతే బొటన వేలికి, అసలు ఎడమ చేయే లేకపోతే కుడి చేతి చూపుడు వేలికి, అది లేకపోతే మధ్య వేలికి, ఆ తర్వాత ఉంగరం వేలికి సిరా గుర్తు వేస్తారు. ఒకవేళ ఓటరుకు రెండు చేతులూ లేకపోతే కాలి వేళ్లకు సిరా గుర్తు పూస్తారు.

# సౌర విద్యుత్తు ఉత్పత్తికి కసరత్తు



నల్గొండ : విద్యుత్తు వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. భవిష్యత్తులో విద్యుత్తు కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఇందుకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రానుంది. ఇలాంటి పరిస్థితిని అధిగమించడానికి ఎక్కడికక్కడే సౌర విద్యుత్తు ఉత్పత్తి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. సౌర విద్యుత్తు తయారు చేసి వినియోగించుకునేలా ఆ శాఖ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. అందుకోసం ప్రభుత్వ స్థలాల ఎంపిక చేయడానికి సర్వే ప్రక్రియ వేగవంతం అయింది.

కుసుమ పథకం ద్వారా..

కేంద్ర ప్రభుత్వం కుసుమ పథకం కింద ప్రతి జిల్లాలో నాలుగు ఎకరాల ప్రభుత్వం భూమి సేకరించాలని నిర్ణయించింది. ఇందులో అన్ గ్రేడ్ సిస్టమ్‌తో రెండు మెగా వాట్ల సౌర యూనిట్లు ఏర్పాటు చేయనుంది. దీంతో ఉత్పత్తి అయ్యే సౌరవిద్యుత్తును విద్యుత్తు సంస్థలకు విక్రయించాలనే ఉద్దేశ్యంతో పథకం ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా రానున్న రోజుల్లో విద్యుత్తు డిమాండ్‌ను అధిగమించి సౌరవిద్యుత్తు ఉత్పత్తి పెద్ద ఎత్తున చేయనున్నారు. ఇది విజయవంతం అయితే రానున్న రోజుల్లో సౌర విద్యుత్తునే ఎక్కువ తయారీ చేసే అవకాశం ఉంది. భూముల సేకరణ కోసం టీఎస్ రెడ్కోకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. భూముల సేకరణకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు పంపినట్లు రెడ్కో అధికారులు తెలిపారు. ఇందుకోసం డీఆర్‌డీఏ, పంచాయతీ శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖలు సంయుక్త సర్వే చేయడానికి నిర్ణయించాయి. ప్రతి జిల్లాలో నాలుగు ఎకరాలు సేకరిస్తే కేంద్ర సంస్థలతో అన్‌గ్రేడ్ సిస్టంతో రెండు మెగా వాట్ల సౌర యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు.


భూముల కోసం సర్వే చేస్తున్నాం..మర్రు పాండురంగారావు, మేనేజర్, టీఎస్ రెడ్కో ఉమ్మడి నల్గొండప్రతి జిల్లాలో నాలుగు ఎకరాల ప్రభుత్వం స్థలాలు సేకరించి అందులో అన్‌గ్రేడ్ సిస్టమ్‌తో మెగా సౌర యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు పంపింది. జిల్లాలో డీఆర్‌డీఏ, దేవాదాయ ధర్మాదాయ, పంచాయతీ శాఖ అధికారులతో చర్చించి భూముల కోసం సర్వే చేస్తున్నారు.

# పకడ్బందీ శిక్షణ.. ప్రజాస్వామ్యానికి రక్షణ

కొత్తగూడెం : సార్వత్రిక సమరంలో అత్యంత కీలక ఘట్టమైన పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. దేశ భవిష్యత్తు, అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించడంలో ప్రతి ఓటూ కీలకమవటంతో పోలింగ్ క్రతువులో అవకతవకలకు తావివ్వకుండా ఎన్నికల సంఘం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందుకోసం జిల్లా, శాసనసభ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రెయినీలను నియమించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పోలింగ్ సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. పోలింగ్ సిబ్బంది శిక్షణ విధానం, పోలింగ్ రోజు చేయాల్సిన, చేయకూడని పనుల సమగ్ర కథనం.

జిల్లాకు ఇద్దరి చొప్పున మాస్టర్ ట్రెయినీలు

జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) సంబంధిత జిల్లాకు ఇద్దరి చొప్పున మాస్టర్ ట్రెయినీ (డిస్ట్రిక్ట్ లెవెల్ మాస్టర్ ట్రెయినీ)లను నియమిస్తారు. వీరిలో ఒకరు ఈవీఎంల టెక్నికల్ అంశాలు బోధిస్తారు. మరొకరు పోలింగ్ ప్రక్రియలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. శిక్షకులుగా పనిచేసిన అనుభవం, ఎన్నికల నిర్వహణపై అవగాహన ఆధారంగా మాస్టర్ ట్రెయినీల నియామకం జరుగుతుంది. పోలింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ తరగతులను డీఎల్‌ఎంటీలు నిర్వహిస్తారు. అనంతరం ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి నియమించిన ఏఎల్‌ఎంటీ(అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రెయినీ)లకు తర్ఫీదు ఇస్తారు. ఏఎల్‌ఎంటీలను సైతం జిల్లా ఎన్నికల అధికారే



నియమిస్తారు. ఎన్నికల ప్రక్రియలో వారికి ఉన్న అనుభవం ఆధారంగా నియామకం జరుగుతుంది.

ముగిసిన ంండో విడత శిక్షణ

పోలింగ్ సిబ్బంది ఎంపిక అనంతరం ఆయా శాసనసభ నియోజకవర్గాల్లో తొలి విడత శిక్షణ తరగతులను డీఎల్‌ఎంటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆతర్వాత చేపట్టిన తొలి విడత ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది పోలింగ్ విధులు నిర్వర్తించబోయే నియోజకవర్గాలను ఖరారు చేశారు. సిబ్బందికి కేటాయించిన నియోజకవర్గాల్లో ఇటీవల రెండో విడత శిక్షణ తరగతులు సంబంధిత ఏఎల్‌ఎంటీల ఆధ్వర్యంలో జరిగాయి. శిక్షణ పూర్తిచేసుకున్న సిబ్బందికి పోలింగ్‌కు ఒకరోజు ముందు రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలు నిర్ణయించనున్నారు.

గత ఎన్నికల్లో సిబ్బంది చేసిన పొరపాట్లు

మాక్ పోల్ సమయంలో 50 ఓట్లు వేశాక కంట్రోల్ యూనిట్‌లో మొత్తం ఓట్లు చూడకుండా పోల్ ముగించటం.

వీవీప్యాట్‌లోని మాక్‌పోల్ స్లిప్స్ తీయకుండా డ్రాప్ బాక్స్ మూసేసి ఓటింగ్ ప్రక్రియ మొదలుపెట్టడం.

ఏదైనా కారణంతో వీవీప్యాట్ మార్చి మాక్ పోల్ నిర్వహించటం.

పోస్టల్ బ్యాలెట్ పేపర్ వినియోగించినవారి వివరాలు ఫాం-17సీలో అసంపూర్తిగా ఉండటం.

ఫాం-17సీలో పోలింగ్ కేంద్రంలోని మొత్తం ఓట్లు అనే కాలమ్‌లో ఈవీఎంలో నమోదైన ఓట్ల సంఖ్య రాయటం.

ఈవీఎంల నిర్వహణపై అవగాహన లేకపోవటంతో తరచూ వాటిని మార్చటం వల్ల సమయం వృథా కావటం.

కంట్రోల్, బ్యాలెట్ యూనిట్ల గుర్తింపు ట్యాగ్‌లను ఒకదానికి బదులు మరొకటి కట్టడం.

పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి(పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి(ఏపీఓ), అదర్ పోలింగ్ ఆఫీసర్స్(ఓపీఓలు) బాధ్యతలు, గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాం. బ్యాలెట్ యూనిట్లను కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌కు అనుసంధానించి వాటిని ఉపయోగించటంపై తర్ఫీదునిచ్చాం. పోలింగ్ కంటే ముందు ఈసీ ఏమైనా మార్పులు చేస్తే ఆవివరాలను సిబ్బందికి సెక్టోరల్ అధికారులు తెలియజేస్తారు. కావాల్సిన దానికంటే 20 శాతం అదనంగా సిబ్బందిని ఎంపికచేసి శిక్షణ ఇచ్చాం. పూసపాటి సాయికృష్ణ, డీఎల్‌ఎంటీ, భద్రాద్రి కొత్తగూడెం

# అక్కడ తప్పని సరి.. ఇక్కడ ఇంతేమరి

మెదక్ : చెల్లించే పన్నుకి జరిగే అభివృద్ధికి ఏ మాత్రం తేడా కనిపించినా కొన్ని దేశాల్లో పౌరులు ఉపేక్షించరు. నాయకులు ఎదురుపడితే నిలదీస్తారు. ఎదురు మాట్లాడితే 'వి ఆర్ టాక్స్ పేయర్స్' అంటూ ఉద్యమాలు చేపడతారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఓటేసేందుకు వెనకాడరు. ఆయా దేశాల్లో ఓటు వేయడాన్ని తప్పనిసరి చేస్తూ చట్టాలూ చేయడంతో పోలింగ్ శాతం పెరుగుతోంది. ఆ విధానాలు ఇక్కడా అమలైతే అద్భుతమైన మార్పులు సాధ్యమవుతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల నుంచి ఏటా రూ.వందల కోట్ల పన్నుల రూపేణా సమకూరుతోంది. సగటు పౌరుడు కొనుగోలు చేసే ప్రతి ఉత్పత్తిపైనా సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ చెల్లిస్తున్నారు. ఉద్యోగులు చెల్లించే పన్నులు ప్రత్యేకం. ఆ పన్ను సవ్యంగా ఖర్చవుతోందా? అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన జరిగిందా? ప్రజా సమస్యలు పరిష్కారమయ్యాయా అనే కోణంలో ఆలోచించాలని సామాజిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సూచిస్తున్నారు. కొందరు పౌరులు ఓటేయడానికి బద్ధకిస్తున్నారు. మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 10-15 శాతం వరకూ పడిపోవడం గమనార్హం.

అక్కడ ఓటింగ్ ఇలా..కొన్ని దేశాల్లో ఓటు వేయడం తప్పనిసరి. లేకుంటే జరిమానాలు విధిస్తారు. ఆ పద్ధతులు ఇక్కడా అమలైతే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది.బెల్జియంలో వరుసగా నాలుగుసార్లు ఓటేయకపోతే పదేళ్ల వరకు ఓటు హక్కుండదు. మొదటిసారి వేయకపోతే రూ.4 వేలు, రెండోసారికి రూ.10వేలు జరిమానా వేస్తారు. ప్రభుత్వ ఉద్యోగావకాశాలు కోల్పోతారు. దీంతో 96 శాతం ఓటింగ్ నమోదవుతుంది.ఆస్ట్రేలియాలోనూ జరిమానా విధానాన్ని అనుసరిస్తున్నారు. ఓటు వేయకపోతే వారం రోజుల్లో జరిమానా చెల్లించాలనే నిబంధన ఉంది. దీంతో ఇక్కడ 98 శాతం పోలింగ్ నమోదవుతోంది.గ్రీస్‌లో ఓటు వేయని వారికి డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు ఇవ్వరు. బలమైన కారణాలు చూపితే తప్ప వాటిని పునరుద్ధరించరు. ఇతర సౌకర్యాలపైనా ఆంక్షలు విధిస్తారు. ఇక్కడ 94 శాతం ఓటింగ్ నమోదవుతుంది.సింగపూర్‌లో ఓటు వేయకపోతే ఓటరు జాబితా నుంచి పేరు తీసేస్తారు. కారణాలను పూర్తి ఆధారాలతో, పెద్దల సంతకంతో అందిస్తేనే ఓటుహక్కు పునరుద్ధరిస్తారు.

# దేశంలో మరోసారి ప్రధానిగా నరేంద్రమోదీ.. : ఈటల



సికింద్రాబాద్: దేశంలో మరోసారి నరేంద్రమోదీయే ప్రధాని అవుతారని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని జేజేనగర్‌లోని మహాబోధి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తమిళుల ఆత్మీయ సమావేశంలో అయన మాట్లాడారు. మోదీ హయాంలో దేశంలో మోడరన్ రైల్వే స్టేషన్లు నిర్మాణం, రైల్వే స్టేషన్లు విమానాశ్రయాల మాదిరిగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. దేశంలో పేదల కోసం 12 కోట్ల టాయిలెట్లు కట్టించారన్నారు. జీఎస్టీని అమలు చేసిన గొప్ప నాయకుడు మోదీ అని ఆయన కొనియాడారు. దేశంలో టెర్రరిజంను అణచివేసి శాంతి నెలకొల్పిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వం అంటే అభివృద్ధే కాదని, ప్రజల విశ్వాసాలను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. దాదాపు ఐదు వందల ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న రామ మందిరాన్ని నిర్మించారని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 11వ స్థానంలో ఉన్న భారతదేశాన్ని 5వ స్థానంలోకి తెచ్చిన ఘనత మోదీకి చెందుతుందని ఈటల చెప్పారు. దేశం సుస్థిరంగా ఉండాలన్నా, మన సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడాలన్నా దేశంలో బీజేపీతోనే సాధ్యమన్నారు. అల్వాల్ ప్రాంతంలో ఫ్లై ఓవర్లు నిర్మాణం, పేదల ఇళ్ల నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. మల్కాజిగిరి అభివృద్ధికోసం అనునిత్యం పాటుపడతానని, ఎల్లప్పుడు అందరికీ అందుబాటులో ఉంటానని, ఈ ఎన్నికల్లో గెలిపించాలని ఈటల ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కొయంబత్తూరు ఎమ్మెల్యే, జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వాసతి శ్రీనివాసన్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణబాబు, నాయకులు గోపు రమణారెడ్డి, రమేష్ గౌడ్, ధనలక్ష్మి, రవీందర్‌రెడ్డి, ప్రసన్న, కన్నాభిరాన్ ఇతర నాయకులు, స్థానికులు, తమిళ కుటుంబాలు పాల్గొన్నాయి.

# కోమటిరెడ్డికి నా గురించి మాట్లాడే అర్హత ఉందా?



హైదరాబాద్, మే 9: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఓ పరాన్న జీవి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కోమటిరెడ్డికి తన గురించి మాట్లాడే అర్హత ఉందా అని ప్రశ్నించారు. "నా ఆస్తులు, కోమటి రెడ్డి ఆస్తుల లెక్కలు తీయండి. ఎవరి ఆస్తులు ఎలా పెరిగాయో తెలుస్తుంది" అని అన్నారు. రేవంత్ రెడ్డివి అజ్ఞానపు మాటలు అని వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక పరిస్థితి తెలీయకుండా హామీలు ఇవ్వడం మోసమే అని చెప్పుకొచ్చారు. గతంలో కంటే తమ ఓట్లు పెరుగుతున్నాయన్నారు. జానారెడ్డి బీఆర్ఎస్ నేతల ఇండ్లకు వెళ్లి కండువా కప్పుతున్నారన్నారు. బిల్లులు ఇవ్వమని బెదిరించి పార్టీలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నేత శాన్ పిట్రాడోవి పిచ్చి మాటలని కొట్టిపారేశారు రాజకీయం కోసమే మోదీ ఆయన మాటలు పట్టించుకుంటున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లో సగం మంది అభ్యర్థులు బీఆర్ఎస్ నుంచి వెళ్ళిన వారే అని.. అంటే తాము బలంగా ఉన్నట్టే కదా? అని అన్నారు. ఎంత పెద్ద వర్షం వచ్చినా తాము రెండు గంటల్లో విద్యుత్ పునరుద్ధరించామని చెప్పుకొచ్చారు.



# హైదరాబాద్‌లో ఫ్రీ బస్సు లొల్లి.. ఆర్టీసీ డ్రైవర్‌పై మహిళ ఆగ్రహం

హైదరాబాద్ : రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం ప్రారంభమైనప్పటి నుంచి నిత్యం ఎక్కడో ఒక చోట ఘర్షణలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. సీట్ల కోసమో, బస్సును ఆపడం లేదనో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా హైదరాబాద్ నగరంలోని లక్డీకాపూల్ బస్టాండ్‌లో గొడవ చోటు చేసుకుంది. లక్డికాపూల్‌లో బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు సిద్ధమైన ఓ మహిళను ఆర్టీసీ డ్రైవర్ నిలువరించాడు. బస్సు ఓవర్ లోడ్ అయిందని చెప్పి ఆమెను బస్సు ఎక్కించుకునేందుకు నిరాకరించాడు. తనను ఎందుకు ఎక్కించుకోరు అంటూ ఆర్టీసీ డ్రైవర్‌పై బాధిత మహిళ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాను బస్సు నడపలేను.. బండి తీసుకొని పో అంటూ ఆమె పట్ల డ్రైవర్ దురుసుగా ప్రవర్తించాడు. బస్సు ఎక్కించుకుంటావా..? లేదా..? అంటూ ఆమె బస్సుకు ఎదురుగా వెళ్లి నిల్చుంది. ఆ తర్వాత ఆమెను ఎక్కించుకోవడంతో బస్సు ముందుకు కదిలింది. ఈ ఘర్షణ నేపథ్యంలో ఫ్రీ బస్సు ఎవరు పెట్టమన్నారంటూ మహిళలు మండిపడ్డారు. ఉచిత బస్ పెట్టి మా ప్రాణాల మీదకు తెస్తున్నారని డ్రైవర్ కూడా అసహనం వ్యక్తం చేశాడు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194





మంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ల పతనం కొనసాగుతోంది. గురువారం సూచీలు భారీ నష్టాలను నమోదు చేశాయి. సార్వత్రిక ఎన్నికలు, మెప్పించని క్యూ4 ఫలితాలు వంటి మార్కెట్ సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. ముఖ్యంగా ప్రధాన షేర్లలో అమ్మకాల ఒత్తిడి, విదేశీ సంస్థాగత మదుపరుల అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్‌లో వెయ్యి పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 22 వేల స్థాయిని కోల్పోయింది. మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.6 లక్షల కోట్లు క్షీణించి రూ.393 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 73,499.49 పాయింట్ల (క్రితం ముగింపు 73,466.39) వద్ద నష్టాల్లో ప్రారంభమై రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 72,334.18 కనిష్ఠానికి చేరిన సూచీ.. చివరికి 1062.22 పాయింట్ల నష్టంతో 72,404.17 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 345 పాయింట్లు కోల్పోయి 21,957 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.51గా ఉంది. సెన్సెక్స్‌లో టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టపోయాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర కాస్త పెరిగి 84.16 డాలర్లకు చేరింది.

# శంకరమ్మ కుటుంబ త్యాగం కాంగ్రెస్ మరవదు



హైదరాబాద్, మే 9: తెలంగాణ ఉద్యమ అమరుడు శ్రీకాంత చారి తల్లి శంకరమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శంకరమ్మకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. శంకరమ్మ కుటుంబం రాష్ట్రానికి చేసిన త్యాగం కాంగ్రెస్ పార్టీ మరవదని మంత్రి తెలిపారు. గురువారం శ్రీకాంత చారి తల్లి శంకరమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాకు చెందిన వందలాది మంది బీఆర్ఎస్ ముఖ్య నేతలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఉత్సాహంగా ఉన్న నేతలను పార్టీలో చేర్చుకోవాలని ఏఐసీసీ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. హుజుర్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరిగాయన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అబద్ధాలు ప్రచారం చేసుకుని గెలవాలని ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. మోదీ దిగజారి మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి శూన్యమని వ్యాఖ్యలు చేశారు. అదాని కాంగ్రెస్ మనిషి అన్నట్లు మోదీ మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇండియా కూటమి కేంద్రంలో, అధికారంలోకి వస్తుందన్న సమాచారంతోనే మోదీ భయంతో మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్ 10 ఏళ్ళు సీఎంగా ఉండి రాష్ట్రాన్ని నాశనం చేశారని విరుచుకుపడ్డారు. తడిసిన ధాన్యాన్ని ఎమ్మెస్పీ ధరకు ప్రభుత్వమే కొంటుందని స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తవగానే కొత్త రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

# కాంగ్రెస్ హామీలు అమలు కాలేదు..కానీ మోదీ చెప్పింది చేస్తారు



2024 ఎన్నికలు రాహుల్ గాంధీకి, ప్రధాని మోదీకి మధ్య జరుగుతున్న ఎన్నికలని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. హెూంమంత్రి యాదాద్రి భువనగిరిలోని బహిరంగ సభలో ప్రసంగించిన క్రమంలో ఈ మేరకు పేర్కొన్నారు. అంతేకాదు ఇవి కుటుంబ అభివృద్ధి, దేశ అభివృద్ధికి మధ్య జరుగుతున్న ఎన్నికలని అన్నారు. తెలంగాణలో బీజేపీ 2019 ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలిచింది. కానీ ఈసారి 10 సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. మూడు విడతల్లో ఇప్పటికే 200 సీట్లు గెలిచామని, మిగిలిన దశల్లో మొత్తం 400 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ముస్లింలకు 4% రిజర్వేషన్ ఇవ్వడంతో షెడ్యూల్ కులాలు, తెగల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అమిత్ షా చెప్పారు. ఈ నేపథ్యంలో బీజేపీకి రాష్ట్రంలో పది సీట్లు ఇస్తే ముస్లింల రిజర్వేషన్ తొలగించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇస్తామని అన్నారు. అంతేకాదు రాష్ట్రంలో రాహుల్ బాబా ఇచ్చిన రుణమాఫీ హామీ ఇప్పటివరకు అమలు కాలేదని అన్నారు. కాంగ్రెస్ వాగ్దానాలు ఎప్పటికీ అమలు చేయదని, కానీ ప్రధాని మోదీ చెప్పింది తప్పక అమలు చేస్తారని హెూ మంత్రి పేర్కొన్నారు. అంతేకాదు ఇప్పటికే వాగ్దానం చేసినట్లుగానే ప్రధాని మోదీ రామ మందిర నిర్మాణం చేయించి చూపించారని అమిత్ షా గుర్తు చేశారు. ఖర్గే చెప్పినట్టుగా రాజస్థాన్, తెలంగాణ ప్రజలకు కశ్మీర్‌కు ఏమి సంబంధమని ఎద్దేవా చేశారు. ఆర్టికల్ 370ని తొలగించి కశ్మీర్‌లో త్రివర్ణ పతాకం ఎగరేలా చేశామని షా అన్నారు. మోదీ ఉగ్రవాదం, తీవ్రవాదం వంటి వాటిని రూపుమాపి మావోయిస్టు సిద్ధాంతాలు లేకుండా చేస్తున్నారని హెూంమంత్రి పేర్కొన్నారు. అసలు తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓవైసీని నిలువరించగలవా అని షా ప్రశ్నించారు. ఈ క్రమంలో ఏబీసీ అనే పదాలకు కొత్త అర్థాలు చెప్పారు. ఏ అంటే అసదుద్దీన్, బీ అంటే బీఆర్ఎస్, సీ అంటే కాంగ్రెస్ అని అమిత్ షా వెల్లడించారు. ఈ పార్టీలు గతంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని కూడా నిర్వహించలేదని హెూం మంత్రి ప్రస్తావించారు. ఇలాంటి పార్టీలను ప్రజలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు.

# కాంగ్రెస్ గ్యారెంటీలకు కాలం చెల్లింది..

## - ఎంపీ ఎన్నికలో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయం: సబితారెడ్డి



హైదరాబాద్: అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయిదు నెలల్లోనే ప్రజలకు సినిమా చూపిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం సరూర్‌నగర్‌లోని ఏఎస్ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల ద్వారా కాంగ్రెస్ మరోమారు ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైనదన్నారు. కాంగ్రెస్ చేసిన మోసాన్ని గుర్తించిన ప్రజలు మే 13న జరిగే ఎంపీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెట్టనున్నారని అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలకు కాలం చెల్లిందన్నారు. బీఆర్ఎస్?తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్న విషయాన్ని ప్రజలు గుర్తించారని, ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని కోరారు. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని స్వామిగౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో సరూర్‌నగర్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు ఆకుల అరవింద్‌కుమార్, ఇంటూరి అంకిరెడ్డి, సుశీలరెడ్డి, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దర్పలి అశోక్, ప్రజాసమస్యల పరిష్కార సమితి అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఆర్. గోపాల్, రమేషగౌడ్, నరేష్ గౌడ్, కేశవరెడ్డి, ఇస్మాయిల్, జహీర్, సలీం, ఉషాగౌడ్, ప్రత్యూష్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, శృతి, సాలెమ్మ, వసంత, శ్వేత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఇన్వర్టర్లు, జనరేటర్లు, పవర్ బ్యాంకులు.. ఇవే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు: కేటీఆర్



హైదరాబాద్: రాష్ట్రంలో కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. ఎండలు మండిపోతుండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతన్న వేళ ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపోయినంతగా విద్యుత్ సరఫరా అవుతుందని కాంగ్రెస్ సర్కార్ చెబుతున్నప్పటికీ కరెంటు కోతలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ .. ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. ప్రజలంతా ఇన్వర్టర్లు, చార్జింగ్ బల్బులు, క్యాండిళ్లు, జనరే టర్లు, పవర్ బ్యాంకులు, టార్చిలైట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచిం చారు. ఇవే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇది బీఆర్ ప్రభుత్వం కాదని.. కాంగ్రెస్ సర్కార్ అని గుర్తుంచుకో వాలన్నారు. మే 13న ఆలోచించి ఓటు వేయాలని చెప్పారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660